క్లుప్తంగా

నేత్రపర్వంగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకిసేవను వేడుకగా శనివారం నిర్వహించారు. విశేషాలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు చేశారు.

ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా సాయిప్రసాద్

పొదలకూరు: ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా సాయిప్రసాద్‌ను నియమించారు. ఈయన కొడవలూరు ఈఓపీఆర్డీగా పనిచేస్తున్నారు. ఇక్కడి పోస్ట్ దీర్ఘ కాలంగా ఖాళీగా ఉండటంతో ఆయన్ను నియమించారు. కాగా ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా పొదలకూరు పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు వ్యవహరిస్తూ వచ్చారు.

కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పొదలకూరు: కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్దే శిక్షణ ఇవ్వనున్నారని చెప్పారు. బీసీ, కాపు, కమ్మ, రెడ్డి, ఈబీసీ, వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ తదితర వర్గాలకు చెందిన 123 మందికి కుట్టు మెషీన్లను అందజేయనున్నామని వెల్లడించారు.

పరీక్షలకు 33 మంది హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శనివారం నిర్వహించిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 33 మంది హాజరయ్యారని ఎగ్జామ్స్ నిర్వహణాధికారి మధుమతి తెలిపారు. 36 మందికి గానూ ముగ్గురు గైర్హాజరయ్యారని చెప్పారు.

అంతుచూస్తానని మహిళకు బెదిరింపులు

నెల్లూరు(క్రైమ్) : తనపై చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని, లేకుంటే అంతు చూస్తానని మహిళను బెదిరించిన ఘటనలో నిందితుడిపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని మూలాపేటకు చెందిన సంధ్యా, అనిల్‌కుమార్ దంపతులు. వారు తమ ఇంటి పత్రాలను తాకట్టుపెట్టగా వచ్చిన నగదును స్నేహితుడు శ్రీధర్‌కు అప్పుగా ఇచ్చారు. అయితే అప్పు తాలుకు నగదు చెల్లించకుండా శ్రీధర్ కాలయాపన చేస్తుండటంతో ఇటీవల అతడిపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం సంధ్యా పనినిమిత్తం జిల్లా కోర్టు వద్దకు వెళ్లగా శ్రీధర్ అడ్డుకున్నారు. తనపై చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో అంతుచూస్తామని, భూమిమీద లేకుండా చేస్తానని ఆమెను బెదిరించాడు. ఈ మేరకు బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అయ్యప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్) : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి శనివారం మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్‌కు చెందిన షేక్ ఫాజిల్(44)కు బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన కరిష్మాతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. వివాహానంతరం ఫాజిల్‌లో బుచ్చిలోనే ఉంటున్నారు. కొద్దిరోజుల కిందట ఆయన ఇంట్లో గొడవపడి బాలాజీనగర్‌లోని తన తల్లి ఇంటికి వచ్చారు. ఈక్రమంలో ఈనెల 19న ఫాజిల్ కనిపించడం లేదని భార్య బుచ్చిరెడ్డిపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు అతనికి ఫోన్‌చేసి ఈనెల 20న పోలీసుస్టేషన్‌కు రావాలని చెప్పారు. అయితే ఫాజిల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండా నగరంలో తిరుగుతూ తాను చనిపోతానని ఫోన్‌లో కుటుంబ సభ్యులు, బంధువులకు మెసేజ్‌లు పంపాడు. గతంలోనూ పలుమార్లు ఇదే తరహాలో ఆయన వ్యవహరించడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఆయన కోటమిట్టలోని మీరా మొహిద్దీన్ దర్గా సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని అతని స్నేహితుడు గుర్తించి ఫాజిల్ అన్న షాజాకు తెలియజేశారు. దీంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకుని తమ్ముడిని రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో నారాయణకు తీసుకెళ్లారు. అక్కడ కూడా అదే విషయాన్ని తెలియజేయడంతో జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. ఈ మేరకు మృతుని అన్న షాజా చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరిగడ్డి ధరలు పైపైకి

- పశువుల మేతకు పెరిగిన డిమాండ్
- పెరుగుతున్న పాల దిగుబడి
- గడ్డి కోసం పాడి రైతుల వెంపర్లాట



డెయిరీ ఫారంలో గేదెలు



ట్రాక్టర్‌లో గడ్డిని తోలుకుంటున్న పాడి రైతులు

పొదలకూరు: వరి గడ్డి ధరలు అమాంతం పెరిగాయి. కోతలు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో పాడి రైతులు దీని కోసం వెంపర్లాడుతున్నారు. ఏడాది పొడవునా గేదెలు, ఆవుల మేత కోసం గడ్డి అవసరమవుతున్న తరుణంలో దీనికి డిమాండ్ పెరిగింది. ఫలితంగా కోతలు జరుగుతున్న ప్రాంతానికి పాడి రైతులు ముందే వెళ్లి అడ్వాన్స్‌లు అందజేస్తున్నారు. సాధారణంగా వరి సాగు చేసే రైతులకు గేదెలుంటాయి. ఈ నేపథ్యంలో వారు పండించే పంట నుంచి వచ్చే గడ్డి సరిపోతుంది. ఫలితంగా పాడిపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వారికి చాలినంత లభ్యం కావడంలేదు. మెట్ట, మాగాణి కలిసి ఉన్న ప్రాంతాల్లో ఒక కారే వరి పండుతుంది. దీంతో గడ్డికి డిమాండ్ పెరిగింది. ఫలితంగా రైతులు కొనుగోలు చేసి వాములు వేసుకునేందుకు పోటీపడుతున్నారు.

పెరిగిన ధరలు

వరి కోతల నేపథ్యంలో గడ్డి కోసం ఆయా గ్రామాలకు పాడి రైతులు వెళ్తున్నారు. కొన్ని కంపెనీల మెషీన్లు వరి పనలను కోసే క్రమంలో గడ్డి చెడకుండా కోస్తున్నాయి. దీంతో అలాంటి గడ్డికి డిమాండ్ బాగా ఉంది. గతంలో మోపులెక్కన విక్రయించేవారు. ఇప్పుడు గడ్డిని ట్రాక్టర్ల ద్వారా చుట్టలు చుడుతున్న నేపథ్యంలో చుట్టను రూ.వంద చొప్పున విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ ట్రక్ నిండా గడ్డి ప్రస్తుతం రూ.11 వేలకు విక్రయమవుతోందని పాడి రైతులు తెలిపారు. ఎకరాల వంతున తీసుకుంటే కోతలు జరిగాక వచ్చే గడ్డి రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేల వరకు ఉంటోంది. అయితే కొనుగోలు చేసిన రైతే గడ్డిని చుట్టలు చుట్టి ట్రాక్టర్‌లో తోలుకోవాల్సి ఉంటుంది. పొదలకూరు మండలంలో అధికారికంగా 14 వేల ఎకరాల్లో.. అనధికారికంగా మరో రెండు వేల ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నారు.

రైతులకు చేదోడుగా..

వరి సాగు వ్యవసాయ ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో రైతులకు గడ్డి నుంచి వచ్చే ఆదాయం చేదోడువాదోడుగా నిలుస్తోంది. ఎకరాలో వరి సాగుకు సుమారు రూ.30 వేలు వెచ్చించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎకరాకు గడ్డి రూపంలో రూ.మూడు నుంచి రూ.నాలుగు వేల వరకు ఆదాయమొస్తోంది. ఫలితంగా ఇది కొంత మేర ఉపయోగపడుతోందని చెప్పారు.

పాల వెల్లువ

మండలంలోని ప్రతి గ్రామంలో పాడి గేదెలున్నాయి. తాటిపర్తి, మహ్మదాపురం, సూరాయపాళెం, విరువూరు, నేదురుమల్లి, వెలికంటిపాళెం తదితర డెల్టా గ్రామాల్లో పాడి పరిశ్రమ అధికంగా ఉంది. నీటి లభ్యత ఇక్కడి గ్రామాల్లో బాగా ఉండటంతో రైతులు పాడిని నమ్ముకొని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. మండలంలో 26 వేల గేదెలు, 2,500 ఆవులు ఉన్నాయి. వీటిలో పాలిచ్చే గేదెలు, ఆవులు సుమారు పది వేల వరకు ఉన్నాయి. వీటి ద్వారా పాడి రైతులు నిత్యం సుమారు 30 వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. దీంతో వరిగడ్డికి డిమాండ్ బాగా పెరిగింది.

గడ్డి ధరలు బాగా పెరిగాయి



వరి గడ్డి ధరలు బాగా పెరిగాయి. గతంలో ట్రాక్టర్ నిండా తోలితే రూ.నాలుగు వేలే ఖర్చయ్యేది. ఇప్పుడు రూ.11 వేల వరకు అవుతోంది. వరి సాగు ఖర్చులు పెరగడంతో గడ్డి ధరలూ అమాంతం పెరిగాయి. పాడి గేదెలు ఉన్నవారు విధిగా వరి గడ్డిని కొనుగోలు చేయాల్సి ఉంటోంది.

– నారాయణరెడ్డి, పాడి రైతు, పులికల్లు

క్షయ వ్యాధి నిర్మూలనపై ర్యాలీ



పొదలకూరులో..

పొదలకూరు: ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో ర్యాలీని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ఉద్యోగులు శనివారం నిర్వహించారు. రామనగర్ గేట్ సెంటర్ నుంచి సీహెచ్‌సీ వరకు సాగిన ర్యాలీలో డాక్టర్ శ్రీకావ్య మాట్లాడారు. వ్యాధిపై అంగన్‌వాడీ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధిని తొలి దశలోనే గుర్తించి మందులు వాడితే నయమవుతుందని చెప్పారు. డాక్టర్లు శివకృష్ణ, మల్లికార్జునరెడ్డి, అనూరాధ, పవన్‌కుమార్, నజ్మా, సూపర్‌వైజర్లు రవికుమార్, శబరినాథ్, ఆరోగ్య సహాయకులు రాధాకుమారి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డేవిస్‌పేటలో న్యాయవిజ్ఞాన సదస్సు



ఇందుకూరుపేట : మండలంలోని డేవిస్‌పేటలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం జరిగింది. రైల్వే జడ్జి పి.వినోద్ పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వం ఉచితంగా న్యాయ సహాయం అందిస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అనిల్‌కుమార్, కావలి జడ్జి జి.విక్రమ్‌సింహ పాల్గొన్నారు.

‘శక్తి’ యాప్‌పై అవగాహన



కోవూరు : పడుగుపాడులోని సుమ నర్సింగ్ కళాశాలలో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు పాల్గొని, పలు సూచనలు చేశారు. కళాశాల చైర్మన్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ వినోదిని తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ స్కూళ్లలో పరీక్ష కేంద్రాలు



మాట్లాడుతున్న నరసింహారావు

పొదలకూరు: ఉల్లాస్‌లో భాగంగా అభ్యాసకులకు పరీక్షను ఆదివారం నిర్వహించనున్నామని, దీనికి అంగన్‌వాడీ స్కూళలో కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంపీడీఓ నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల స్థాయి కోఆర్డినేటర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 693 వయోజనులకు 45 అంగన్‌వాడీ స్కూళ్లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. వెలుగు ఏపీఎం చిన్నయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆదినారాయణమ్మ, పద్మావతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూ వలంటీర్‌కు ప్రశంసపత్రం



గవర్నర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న తేజస్విని

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ ఎన్నెస్సెస్ వలంటీర్ తేజస్వినికి అరుదైన గుర్తింపు లభించింది. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రాతినిధ్యం వహించిన ఆమెకు ప్రశంసపత్రాన్ని గవర్నర్ అబ్దుల్ నజీర్ విజయవాడలో అందజేశారు.
తేజస్వినిని వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత తదితరులు శనివారం అభినందించారు.

తాటిపర్తి ఉప సర్పంచ్ ఎన్నిక 27న

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికను ఈ నెల 27న నిర్వహించనున్నామని ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడారు. ఎన్నికకు సంబంధించిన ఏర్పాట్లను పంచాయతీ సెక్రటరీ చేస్తున్నారని చెప్పారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరులోని ప్రగతినగర్‌కు చెందిన మనోహర్ పనినిమిత్తం బైక్‌పై పంటపాళెం బయల్దేరారు. ఈ క్రమంలో సర్వేపల్లి సమీపంలో బైక్ అదుపుతప్పడంతో ఆయన గాయపడ్డారు. చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు.

దర్గాకు వెళ్లొచ్చేలోపు ఇల్లు గుల్ల

- ఇంట్లోని వస్తువులన్నీ చోరీ

కోవూరు : ఇంట్లో చిడిగా ఉందని ఏఎస్‌పేట దర్గాకు వెళ్లి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిని గుల్ల చేసిన ఘటన కోవూరు మండల కేంద్రంలోని చెర్లోసంఘంలో చోటుచేసుకోంది. బాధితుల కథనం మేరకు.. చెర్లోసంఘానికి చెందిన షాకీర తన భర్త, పిల్లలతో కలిసి గత నెల 25న ఏఎస్‌పేట దర్గాకు వెళ్లారు. నెల రోజుల పాటు అక్కడే నిద్ర చేశారు. ఈనెల 19వ తేదీ వారు తిరిగి ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో ఇంటికి బిగించి ఉన్న సేఫ్టీ గ్రిల్ తలుపులు సైతం తొలగించి ఇంట్లో ఉన్న టీవీ, ఏసీ, డ్రెస్సింగ్ టేబుల్, డబుల్ కాట్ మంచం, సైకిల్‌ను అపహరించుకుని వెళ్లినట్లు గుర్తించారు. రెండు రోజులుగా చుట్టుపక్కల వారిని విచారించగా ఎటువంటి సమాచారం దొరకలేదు. ఈ మేరకు శనివారం కోవూరు పోలీసులుకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

కొడవలూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి శనివారం తెలిపారు. అన్నిశాఖల మండల స్థాయి అధికారులు హాజరవుతారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గిరిజనులకు న్యాయం చేస్తాం

ఇందుకూరుపేట : ఉన్నతాధికారుల సూచనల మేరకు గిరిజనులకు తగిన న్యాయం చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ తెలిపారు. మండలంలోని కొరుటూరు గ్రామానికి చెందిన గిరిజనులు శ్మశాన స్థల ఆక్రమణపై ఇటీవల రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీటీ, మండల సర్వేయర్ హరనాథ్, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గిరిజనులతో పాటు, ఆక్రమణదారుల వాదనలు విన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు. గిరిజన సంఘ నాయకులు అశోక్, బాబు, ఆదిశేషయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇందుకూరుపేట : ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ పగటిపూటే ఇళ్ల తలుపులు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నారని, మండల వాసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నాగార్జునరెడ్డి కోరారు. ఆ వ్యక్తి తెల్లరంగు స్విఫ్ట్ కారులో సంచరిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఉదయగిరి, పాములూరు ప్రాంతాల్లో శనివారం చోరీలకు పాల్పడినట్లు సమచారం అందన్నారు. మీ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

ఎస్సీలకు అన్యాయం చేస్తున్న కూటమి నేతలు



మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు : కోవూరు ఏఎంసీ(వ్యవసాయ మార్కెట్ కమిటీ) చైర్మన్ పదవిని ఎస్సీకి కేటాయిస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేయగా, మన పాలకులు దానిని రద్దు చేయించి ఓసీకి కేటాయించి ఎస్సీలకు అన్యాయం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు తెలిపారు. నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథి గృహ ప్రాంగణంలో శనివారం ఆయన మాట్లాడారు. కోవూరు ఏఎంసీ చైర్మన్ పదవి తొలి నుంచి ఓసీలకు కేటాయిస్తూ వచ్చారని, అయితే 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ మహిళకు కోవూరు ఏఎంసీ చైర్మన్ పదవిని కేటాయించారన్నారు. దీనిని అప్పటి ఎమ్మెల్యే ప్రసన్న ఆనందంగా స్వీకరించారన్నారన్నారు. అంతేకాకుండా ఐదేళ్ల తరువాత జరిగే రిజర్వేషన్‌ల కేటాయింపులో కోవూరు ఏఎంసీని ఎస్సీకి కేటాయించాలని ప్రసన్న అప్పటి వ్యవసాయశాఖ మంత్రి కాకాణికి లేఖ రాశారన్నారు. ఆ నిర్ణయం మేరకే కోవూరు ఏఎంసీని ప్రస్తుత ప్రభుత్వం ఎస్సీకి కేటాయిస్తూ జీఓ ఇచ్చిందన్నారు. కానీ మన పాలకులు కూటమి అగ్ర నేతలపై ఒత్తిడి తెచ్చి ఎస్సీ కేటాయింపును రద్దు చేయించి ఓసీకి కేటాయించేలా చేశారన్నారు. ఈ దారుణాన్ని పార్టీలకతీతంగా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.

ఆ నాయకుడికి కట్టబెట్టేందుకేనా?

టీడీపీ నేత, స్థానిక ఎమ్మెల్యేకు అనుచరుడిగా ఉన్న విడవలూరు మండలానికి చెందిన ఓసీ నాయకుడికి ఏఎంసీ చైర్మన్ పదవిని కట్టబెట్టేందుకే ఎస్సీ కేటాయింపును రద్దు చేయించారని చలపతిరావు విమర్శించారు. ఆ నాయకుడు ఎస్సీలకు జీవనాధారం కోసం ప్రభుత్వమిచ్చిన కారును తెల్లబోర్డుగా మార్చి వినియోగిస్తున్నారని, దీనిని వెలుగులోకి తేగా మరలా పసుపు బోర్డు వేసుకున్నారన్నారు. అంతేకాకుండా గత టీడీపీ ప్రభుత్వంలో ఎల్‌పీఎస్ కింద 91 మంది ఎస్సీలకు 91 ఎకరాలు కేటాయించారని, దానిని వారికి అప్పగించకుండా ఆ నాయకుడే లబ్ధిపొందుతున్నారని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో పేదలకు రావల్సిన వేతనాలు తన ఖాతాలో వేసుకొంటుండడాన్ని ఆ నాయకుడి పేరుతో ఉన్న జాబ్ కార్డు చూపుతూ చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.నిరంజన్‌బాబురెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరిరావు, ఎ.అనూప్‌రెడ్డి, కె.నవీన్‌రెడ్డి, సాహుల్, ఎం.శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, నాయకులు పి.అచ్యుతరెడ్డి, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు నిప్పు

- ఇబ్బందులు పడిన విద్యార్థులు



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

కోవూరు : స్థానిక పచ్చిపాల రామనాథమ్మ బాలికోన్నత పాఠశాల వెనుక భాగంలో ఉన్న పంచాయతీ డంపింగ్ యార్డుకు గుర్తుతెలియని వ్యక్తులు శనివారం నిప్పు పెట్టారు. దీని వల్ల దట్టమైన పొగ చుట్టుపక్కల వ్యాపించింది. కాగా అదే పాఠశాలలో పదో తరగతి పరీక్షలు జరుగుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంటనే ఉపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వెంటనే వచ్చి మంటలను అదుపుచేశారు.

దోమలను నివారించండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం : గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని సీపీఎం నేత చల్లకొలుసు మల్లికార్జున డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రేబాల, నాగమాంబపురం అరుంధతీయవాడలో సీపీఎం నేతలు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి కుళాయిల వద్ద మురుగు పేరుకు పోయిందని, దీనివల్ల గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వెంటనే పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు. సీపీఎం నాయకులు చిరమణ జానకిరామయ్య ఇందూరుపల్లి రమణయ్య, రామయ్య, చిరమన అనిల్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక



విడవలూరులో..



ముత్తుకూరు: విచారణ జరుపుతున్న అధికారులు

ముత్తుకూరు: మండలంలో 2023, ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి వరకు చేపట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. 405 పనులకు రూ.4.48 కోట్లను ఖర్చు చేయగా, మెటీరియల్ రూపంలో రూ.4.24 కోట్లను వెచ్చించారు. ప్రక్రియను డ్వామా పీడీ గంగాభవాని, డీవీఎం విజయలక్ష్మి, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఏపీడీ గాయత్రిదేవి తదితరులు నిర్వహించారు. పనులకు రాకుండానే మస్టర్లు వేసినందుకు ఒక మేట్ నుంచి రూ.24 వేల రికవరీకి ఆదేశించారు.

విడవలూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్, పీఆర్ డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన సోషల్ ఆడిట్‌ను ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 ఉపాధి పనులపై రికార్డులను పరిశీలించారు. మండలంలో మొత్తం 908 పనులకు సోషల్ ఆడిట్ నిర్వహించగా, రూ.26,767ల రికవరీకి ఆదేశించారు. అనంతరం డ్వామా పీడీ బి.గంగాభవాని మాట్లాడుతూ గ్రామంలో అర్హులందరికీ జాబ్‌కార్డులు అందజేయాలని, కనీస పని దినాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. అంబుడ్స్‌మెన్ ఎం.వెంకట్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి డి.విజయలక్ష్మి పాల్గొన్నారు.